ఈనాడు జోగులాంబ గద్వాల

మంగళవారం సెప్టెంబరు 1, 2026

నెట్టెంపాడు ప్రధాన కాల్వకు గండి

పంట పొలాల్లోకి చేరిన నీరు

కృష్ణవేణి చౌక్(గద్వాల), న్యూస్‌టుడే: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని 99వ ప్యాకేజీ ప్రధాన కాలువకు సోమవారం గండి పడటంతో గద్వాల మండలం కొండపల్లి సమీపంలో పంట పొలాల్లోకి నీరు చేరి రైతులకు నష్టం వాటిల్లింది. రైతు రాముడు పొలంలో సాగు చేస్తున్న మూడెకరాలు, రంగన్నకు చెందిన రెండెకరాల మిర్చి పంట నీట మునిగింది. అధికారులు గండిని పూడ్చి, తమకు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. 99వ ప్యాకేజీ ప్రధాన కాలువ ద్వారా కొన్నిరోజుల నుంచి చెరువులకు నీటిని విడుదల చేస్తున్నారు. మట్టికట్ట పటిష్ఠంగా లేకపోవడంతో గండి పడి నీరు వృథాగా పోతోంది.

ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద తగ్గిన నీటి నిల్వ

శాంతినగర్, న్యూస్‌టుడే: ఆర్డీఎస్ ఆనకట్టలో సోమవారం నీటి నిల్వ 3 అడుగులకు తగ్గిపోయింది. ఎగువ నుంచి ఆనకట్టలోకి 150 క్యూసెక్కుల నీటి ప్రవాహం మాత్రమే ఉన్నట్లు కర్ణాటక అధికారులు తెలిపారు. ప్రధాన కాల్వకు 2 అడుగుల నీరు మాత్రమే విడుదల అవుతున్నట్లు తెలిపారు. తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు పడితే తప్ప ఆనకట్టలోకి నీటి నిలువ పెరిగే పరిస్థితి కనిపించడం లేదు.

హద్దులు దాటి చదును చేసి

అంబాట్‌పల్లిలోని గుట్ట వద్ద ఇలా

నిఘా

ఈనాడు డిజిటల్, నాగర్‌కర్నూల్: జిల్లాలో ప్రభుత్వ భూములను ఆనుకుని ఉన్న కొందరు పట్టాదారులు క్రమంగా హద్దులు దాటి వాటిని చదును చేస్తూ స్వాధీనం చేసుకుంటున్నారు. ప్రభుత్వ గుట్టల్లోని మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తుంటే..ఆ తర్వాత అదే ప్రాంతాన్ని ఇంకొందరు చదును చేసి క్రమంగా సాగు భూమిగా మార్చేస్తున్నారు.

జిల్లాలో ఎక్కడెక్కడంటే..!

కోడేరులోని ఊరగుట్టను మూడు ఎకరాల వరకు తవ్వేసి చుట్టూ మామిడితోటను పెంచుతున్నారు. పసుపుల నడింగట్టు శివారున రెండెకరాల వరకు సాగుచేస్తున్నారు. కొల్లాపూర్ నుంచి సోమశిల వెళ్లేదారిలో గుట్టల్ని, అటవీభూమిని చదునుచేస్తున్నారు. బావాయిపల్లి శివారులోని ఎల్లమ్మతిప్ప వద్ద ఉన్న భూమి ఆక్రమణకు గురవుతోంది. తెలకపల్లి, రఘుపతిపేటకు సమీపంలోని రామగిరిగుట్ట మట్టిని నిత్యం తరలించేస్తున్నారు. అక్కడ చదును చేసిన ప్రాంతంలో క్రమంగా కొందరు వ్యక్తులు సాగులోకి తీసుకువస్తున్నారు. పెంట్లవెల్లి మండలం మంచాలకట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమంగా చదును చేస్తున్నారు. అటవీ భూములకు ఆనుకుని చెట్లను తొలగిస్తూ ఎకరాలను సాగులోకి తెస్తున్నారు.

అధికారులకు ఫిర్యాదు..

లింగాల మండలం అంబటిపల్లి గ్రామంలోని సర్వేనం 471లో 6.36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అక్రమంగా చదును చేసి సాగుకు సిద్ధపడ్డారని పంచాయతీ తరఫున ఉపసర్పంచి సోమవారం 'ప్రజావాణి'లో ఫిర్యాదుచేశారు.

ఆర్ఐతో విచారణ

అంబాట్‌పల్లి శివారులోని సర్వేనం 471లో ప్రభుత్వ భూమి ఉంది. ఆక్రమణ విషయమై ఆర్ఐతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం. తగిన చర్యలు తీసుకుంటాం. -వెంకటేశ్, తహసీల్దార్, లింగాల

రైతు వేదికలకు సౌర వెలుగులు

భవనాల పరిస్థితిపై నివేదిక కోరిన ప్రభుత్వం

అయిజ, న్యూస్‌టుడే: రైతు వేదికలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా సౌర ఫలకల ఏర్పాటుకు అనుమతించింది. వీటిని అమర్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థ హైదరాబాద్ వ్యవసాయ సహకార సంఘాని (హాకా)కి బాధ్యతలు అప్పగించింది. జిల్లాల వారీగా రైతు వేదికల పరిస్థితిపై నివేదిక అందజేయాలని ప్రభుత్వం కోరింది. జిల్లా వ్యవసాయాధికారులు నివేదిక తయారీలో నిమగ్నమయ్యారు.

పగుళ్లిచ్చిన అయిజ రైతు వేదిక ర్యాంపు

నిర్వహణ లోపంతో.. : ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చాలా రైతు వేదికలు అధ్వానంగా మారాయి. తలుపులు, కిటికీల అద్దాలు ధ్వంసమయ్యాయి. మెట్లు, ర్యాంపులు పగుళ్లిచ్చాయి. కొన్నిచోట్ల ముళ్ల చెట్లు పెరిగాయి. నిర్వహణకు నిధులను మంజూరు కాకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది.



ఉమ్మడి జిల్లాలో 472.. : గత ప్రభుత్వం క్లస్టర్లను ఏర్పాటు చేసి రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో వేదికను రూ.22 లక్షలతో నిర్మించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 472 రైతు వేదికల నిర్మాణాలకు రూ.103.84 కోట్లు వెచ్చించారు.

రక్షణ లేక చోరీలు

వేదికలకు రక్షణ లేకపోవడంతో రాత్రిళ్లు చోరీలు జరుగుతున్నాయి. చాలాచోట్ల ఎలక్ట్రిక్ పరికరాలు, బ్యాటరీలు, విలువైన వస్తువులు తదితరాలు చోరీ చేశారు. దొంగతనాలను అరికట్టడానికి ఇప్పటికైనా సౌర విద్యుత్తు కంచె ఏర్పాటు చేయాలని రైతులు, వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

నీటి వసతి కరవై

కనీసం నీటి వసతి కూడా లేకపోవడంతో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వేదికలను శుభ్రం చేసేందుకు, సమావేశాలకు కుర్చీలు వేసేందుకు స్వీపర్లు లేరు. అన్నీ ఏఈవోలే చూసుకుంటున్నారు. తాగునీరు, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఇతర ఖర్చులను అధికారులే భరిస్తున్నారు.

బస్సు రాక.. ప్రయాణం తప్పక

మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి కొన్ని రోజులుగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గద్వాల పట్టణంలోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు కోసం నిరీక్షించినా సమయానికి రాకపోవడంతో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో అదనపు ఛార్జీల భారం పడటంతో పాటు, ఒకే ఆటోలో ఎక్కువ మంది ప్రయాణించాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి బస్సు సర్వీసు వెంటనే పునరుద్ధరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మల్దకల్

పది రోజుల్లో భూసేకరణ పూర్తి

వనపర్తి, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ నుంచి డోన్ వరకు ప్రస్తుతం ఉన్న రైల్వే మార్గాన్ని డబుల్ లైనింగ్ చేసేందుకు జిల్లాలో చేపట్టాల్సిన భూసేకరణ పనులు పది రోజుల్లో పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.

సమాజ సేవ.. వికాస తోవ

- స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల ఏర్పాటుకు నిధులు

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సేవాభావం, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం నిర్వహిస్తోంది. గతేడాది నుంచి కొన్ని పాఠశాలల్లో అమలు చేస్తుండగా, మంచి ఫలితాలు రావడంతో.. తాజాగా మరికొన్ని బడుల్లో అమలు చేసేందుకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నెలలోనే బృందాలను ఏర్పాటు చేసి, అమలుకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సమగ్ర శిక్షా నుంచి ఆదేశాలందాయి.

రూ.3.94 కోట్లు.. : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,227 ప్రభుత్వ పాఠశాలలుండగా, ఇప్పటికే 78 కస్తూర్బాల్లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమం అమలవుతోంది. ఈ ఏడాది నుంచి 115 పీఎంశ్రీ పాఠశాలల్లో, 156 సాధారణ పాఠశాలల్లో అమలుకు చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు ఒక్కో పీఎంశ్రీ పాఠశాలకు రూ.2.50 లక్షలు చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.2.87 కోట్లు, సాధారణ పాఠశాలలకు రూ.69 వేలు చొప్పున రూ.1.07 కోట్లు మంజూరయ్యాయి. విద్యార్థులకు అవసరమైన ప్రత్యేక యూనిఫామ్స్ అందించడంతో పాటు, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయడం, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పించనున్నారు. ఈ మేరకు పాఠశాల ఉపాధ్యాయులకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

రాజోలి కేజీబీవీలో మొక్కలు నాటేందుకు గుంత తవ్వుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థినులు

జిల్లా	జడ్పీ పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)	పీఎంశ్రీ పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
జోగులాంబ	45	31.05	22	55
మహబూబ్‌నగర్	40	27.60	26	65
నాగర్‌కర్నూల్	20	13.80	27	67.50
నారాయణపేట	37	25.53	19	47.50
వనపర్తి	14	9.66	21	52.50

కార్యక్రమాలు ఇవే..

- **సమగ్ర వికాసం** : విద్యార్థుల శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడుతుంది.
- **సేవా దృక్పథం** : సమాజంలో తోటి వారికి సహాయపడటం, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడం, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యేలా నేర్పిస్తారు.
- **శిక్షణ శిబిరాలు** : విపత్తుల సమయంలో చేయాల్సిన పనులు, ప్రథమ చికిత్స వంటి వాటిపై శిక్షణ ఇస్తారు.
- **అవుట్ డోర్ క్యాంపులు** : ప్రకృతిని పరిశీలించడం, బృందంగా పని చేయడం, నాయకత్వ లక్షణాలు ఎలా అలవరచుకోవాలో నేర్పిస్తారు.

రూ.108 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు

- 2027లో గద్వాల స్టేషన్ శతాబ్ది ఉత్సవాలు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

గద్వాల: మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ డీకే అరుణ, డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్

గద్వాల కలెక్టరేట్, అలంపూర్, శాంతినగర్, న్యూస్‌టుడే: వందేళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 2027 ఏప్రిల్‌లో నిర్వహిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న అమృత్ భారత్ పథకంలో భాగంగా గద్వాల రైల్వే స్టేషన్‌లో రూ.108 కోట్లు వ్యయం చేస్తూ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఇటీవల రెండో రైల్వే గేటు వద్ద రూ.66 కోట్లతో మరో ఆర్వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గద్వాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, రైల్వే ఉన్నతాధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా తెలంగాణలో 42 రైల్వే స్టేషన్‌లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.886 కోట్లు మంజూరు చేస్తే.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క తెలంగాణలో రైల్వేలకు రూ.5,454 కోట్లు కేటాయించిందన్నారు. ఈ ఏడాది 118 ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంలో భాగంగానే గద్వాలకూ మంజూరు చేశారని గుర్తుచేశారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ. . గద్వాల మీదుగా రాకపోకలు సాగిస్తున్న పలు రైళ్లకు స్టాపింగ్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వందేభారత్ గద్వాల స్టేషన్‌లో హాల్ట్‌కు పరిశీలించాలని రైల్వే ఉన్నతాధికారులను కోరారు. డీఆర్ఎం సంతోష్‌కుమార్ వర్మ, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, గద్వాల పుర ఛైర్‌పర్సన్ జయలక్ష్మి , భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, మైనార్టీ నాయకులు అఫ్సర్‌పాషా, రాజగోపాల్, అయ్యపురెడ్డి పాల్గొన్నారు. • అలంపూర్ హరిత టూరిజం వద్ద ఆర్డీఎస్, తుంగభద్ర డ్యామ్ నుంచి నీటి విడుదలలో నెలకొన్న సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణకు సోమవారం రైతులు వినతి పత్రం అందజేశారు.

అలంపూర్: ఆర్డీఎస్ సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి

గగనాన.. మేఘాల పందిరి

చంద్రుడి చుట్టూ మేఘాలు తోరణాలు కట్టినట్లు కనిపిస్తున్న దృశ్యాలు పట్టణంలోని దత్తాత్రేయ సంకల్ప సిద్ధి సాయిబాబా ఆలయ ఆవరణలో కనిపించాయి.

- న్యూస్‌టుడే, కొత్తకోట గ్రామీణం

ఆగస్టూ ఆదుకోలే!

జిల్లాలో 53 శాతం లోటు వర్షపాతం

గద్వాల న్యూటౌన్, న్యూస్‌టుడే: వర్షాభావ ప్రభావం నడిగడ్డ జిల్లాను వెంటాడుతోంది. జూన్, జులై మాసాల్లో వర్షాలు కురవకపోయినా.. ఆగస్టు ఆదుకుంటుందని అంతా భావించారు. అయితే ఈ మాసంలో మరింత లోటు వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంలో సగం కూడా కురవని గడ్డు పరిస్థితిని ప్రజలు ఎదుర్కొంటున్నారు. ఈ నెలలో సగటున 4 రోజుల పాటు మాత్రమే వర్షం కురిసింది. దీంతో వర్షాధారంగా సాగు చేసిన పంటలు ఎండిపోతుండగా, మానవపాడు, ఇటిక్యాల వంటి ప్రాంతాల్లో పంటలు సాగు చేయకుండా బీడుగా వదిలేసిన పరిస్థితి కనిపిస్తోంది. కాలువలు, బోర్లకింద సాగు చేసిన పంటల్లో సైతం ఎదుగుదల ఆశించిన స్థాయిలో లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా వివరాలు

మండలం	సాధారణం (మి.మీ.లో)	ఆగస్టు 31 నాటికి కురిసింది
కేటీదొడ్డి	117.4	123.6
ధరూర్	119.5	72.6
గద్వాల	134	92.4
ఇటిక్యాల	132.1	92.3
గట్టు	117.5	97.8
అయిజ	124.5	50.7
రాజోలి	146.3	43.1
వడ్డేపల్లి	140.7	20.6

అత్యధికంగా వడ్డేపల్లిలో..

ఆగస్టులో సాధారణ వర్షపాతం 131 మి.మీలు ఉండగా.. కేవలం 61.5 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. దీంతో 53 శాతం లోటు కనిపిస్తోంది. కేవలం కేటీదొడ్డి మండలంలో మాత్రమే సాధారణ వర్షం కురిసింది. అత్యధికంగా వడ్డేపల్లి మండలంలో 85 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు జిల్లా సగటు వర్షపాతం 327.1 మి.మీ కురవాల్సి ఉండగా 202.2 మి.మీ మాత్రమే నమోదైంది. 38 శాతం లోటు కనిపిస్తోంది. మూడు నెలల లోటుతో రానున్న సెప్టెంబరులో వర్షాలు కురిసినా పెద్దగా ప్రయోజనం ఉండదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పతకాలే గోల్

ధన్వాడ, న్యూస్‌టుడే: ధన్వాడ మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకులానికి చెందిన విద్యార్థులు పుట్‌బాల్‌లో రాణిస్తున్నారు. వీరు ఏ స్థాయిలో రాణిస్తున్నారంటే బంతిని తోస్తే చాలు గోల్‌లో పడాల్సిందేనన్న విధంగా రాటుదేలారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సుబ్రతో ముఖర్జీ కప్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 15న దిల్లీలో జరగనున్నాయి. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే' క్రీడాకారులను పలకరించగా వెలిబుచ్చిన అభిప్రాయాలిలా ఉన్నాయి.

నా పేరు **ఎం సిద్ధు.** కొండాపూర్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుకుంటున్నా. నాకు చిన్నప్పటి నుంచి పుట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం. గురుకులంలో ప్రవేశం పొందిన తర్వాత పుట్‌బాల్ శిక్షణ ఇస్తుండటంతో ఇష్టంగా ప్రవేశం పొంది నేర్చుకుంటున్నా. గతంలో పలుమార్లు జిల్లా జట్టు తరఫున హాజరయ్యాను. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో నారాయణపేట జట్టు తరఫున పాల్గొని బంగారు పతకం సాధించడం జరిగింది. భవిష్యత్తులో ఆర్మీ ఉద్యోగం సాధించి ఇండియా తరఫున గోల్ కీపర్‌గా ఎంపిక కావాలన్నదే లక్ష్యం.

నా పేరు **ముడావత్ అరుణ్** కొండాపూర్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుకుంటున్నా. అమ్మానాన్నలు తారమ్మ తోక్యా వ్యవసాయ కూలీలు. బయట చదివించలేక గురుకులంలో చేర్పించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఉపాధ్యాయుల తరచూ చెప్పే మాటలకు ప్రేరణ పొంది పుట్‌బాల్ ప్రాక్టీస్ చేపట్టా. కోచ్ రామ్మోహన్‌గౌడ్ ప్రోత్సాహంతో మంచి ప్రావీణ్యం సాధించా. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. పుట్‌బాల్ కోచ్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం.

నా పేరు **కాట్రావత్ మహేష్.** గురుకులంలో ఇంటర్ చదువుకుంటున్నా. పలు సందర్భాల్లో ఐఏఎస్‌లకు లభిస్తున్న గౌరవాన్ని చూశా. ఆ స్థాయికి నేనెందుకు చేరుకోకూడదన్న ప్రశ్న ఉదయించింది. దీని సాధన కోసం చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నిశ్చయించుకొని పుట్‌బాల్ సాధన చేస్తున్నాను. కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ముందు క్రీడా కోటల్లో ఏదేని ఉద్యోగం సాధించి దీని ద్వారా ఐఏఎస్ సాధించాలనుకుంటున్నా.

గంజాయి మత్తు.. యువత చిత్తు

హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా విక్రయాలు

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఆదివారం ఆరు కిలోల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంత భారీ మొత్తంలో పోలీసులకు సరకు దొరకడం ఉమ్మడి జిల్లాలోనే ఇదే మొదటిసారి.

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అరకొరగా ఉంటూ, గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్న దందా ఇప్పుడు బహిరంగంగానే ఆయా ప్రాంతాల్లో నడుస్తోంది. మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల వెనక భాగంలో నిర్మాణంలో ఉన్న భవనాల్లో కొందరు విద్యార్థులు గంజాయి మత్తులో మునుగుతున్నారు. గంజాయిని విక్రయించేవారు అక్కడికి వచ్చి విద్యార్థులకు అందిస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో గంజాయి మత్తులో యువత చిత్తవుతోంది. హైదరాబాద్‌లోని ధూల్‌పేట్, కర్నూలు, నల్లమల అటవీ ప్రాంతం, రాయచూర్ తదితర ప్రాంతాల నుంచి అక్రమార్కులు సరకు దిగుమతి చేసుకుంటున్నారు. వీటిని 5 గ్రాముల ప్యాకెట్లుగా చేసి రూ.400 -600కు విక్రయిస్తున్నారు. ఇందులో ఆటో డ్రైవర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారు. • మహబూబ్‌నగర్, జడ్చర్ల, కల్వకుర్తి, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొత్తకోట, పెబ్బేరు, అలంపూర్, గద్వాల, నారాయణపేట, మక్తల్, మరికల్, కొల్లాపూర్, అచ్చంపేట తదితర ప్రాంతాల్లో యువతకు ప్యాకెట్లను విక్రయిస్తున్నారు.

మహబూబ్‌నగర్‌లోనే అధిక కేసులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ గంజాయి విక్రయాలు, వినియోగంలో మహబూబ్‌నగర్ జిల్లా ముందంజలో ఉంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 27 కేసులు నమోదు కాగా, అందులో మహబూబ్‌నగర్‌లో 21 నమోదయ్యాయి. ఇక్కడ ఏ మేరకు గంజాయి వాడకం ఉందో ఈ గణాంకాలే చెబుతున్నాయి. • నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో రెండేసి చొప్పున, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 16 కేసులు నమోదు కాగా, అందులో మహబూబ్‌నగర్ జిల్లాలో 13 ఉన్నాయి. నాగర్‌కర్నూల్‌లో రెండు, జోగులాంబ గద్వాల జిల్లాలో ఒకటి చొప్పున కేసులను పోలీసులు నమోదు చేశారు.

నియంత్రణకు కృషి..: ఉమ్మడి జిల్లాలో గంజాయి కేసుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. పలు ప్రాంతాల్లో నిఘా పెట్టాం.
- విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖ

ప్లాస్టిక్ నిషేధం.. నల్లమల సురక్షితం

ఏటీఆర్‌లో వ్యర్థాల రీసైక్లింగ్

బెయిలింగ్ యంత్రంలో ప్లాస్టిక్ సీసాలు వేస్తున్న సిబ్బంది

అమ్రాబాద్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ భూతం నుంచి నల్లమలలోని వన్యప్రాణులు, అడవి నేల, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు అటవీ శాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే. మన్ననూరు చెక్‌పోస్టు వద్ద భక్తులు, పర్యాటకుల నుంచి ప్లాస్టిక్ నీటి సీసాలు, కవర్లను సేకరించి అడవిలో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారు. సేకరించిన వ్యర్థాలను మన్ననూరు బెయిలింగ్ సెంటర్‌కు తరలించి బెయిళ్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

- వన్యప్రాణులకు ముప్పు
ప్లాస్టిక్ కవర్లు, నీటి సీసాలను అడవిలో పడేయడంతో వన్యప్రాణులు, నేల ఆరోగ్యం దెబ్బతింటోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా తిన్న వన్యప్రాణులు మృత్యువాత పడే అవకాశం ఉంది. నేల, నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం కూడా ఉంది.

బెయిలింగ్ కేంద్రంలో పోగేసిన ప్లాస్టిక్

బెయిలింగ్, రీసైక్లింగ్‌కు తరలింపు

సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను మన్ననూరు బెయిలింగ్ కేంద్రానికి తరలిస్తారు. ప్రత్యేక యంత్రంతో వాటిని బెయిళ్లుగా మార్చి నిల్వ చేస్తున్నారు. కొంత మొత్తం పోగయ్యాక వాటిని రీసైక్లింగ్ కేంద్రాలకు విక్రయిస్తున్నారు. గత రెండేళ్లలో ఒక్కొక్కటి సుమారు 30 కిలోల బరువుండే 345 ప్లాస్టిక్ సీసాల బెయిళ్లను విక్రయించారు. కిలో ప్లాస్టిక్‌ను సగటున రూ.10 చొప్పున అమ్ముతున్నారు.

చెక్‌పోస్టు వద్దే అడ్డుకట్ట

నల్లమల గుండా ప్రముఖ పుణ్యక్షేత్రాలు శ్రీశైలం, మద్దిమడుగుకు నిత్యం వందలాది వాహనాలు అటవీ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. భక్తులు ప్లాస్టిక్ సీసాల్లో నీటిని తీసుకెళ్తుంటారు. అడవిలోకి ప్రవేశించే ముందే వాటిని మన్ననూరు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది సేకరిస్తున్నారు. లీటరు, అంతకన్నా తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్ నీటి సీసాల విక్రయాన్ని నల్లమలలో నిషేధించారు. పర్యాటకులు పడేసే ప్లాస్టిక్ సీసాలు, కవర్లను సేకరించేందుకు 16 మందిని వాచర్లను నియమించారు. వీరు నిత్యం సుమారు 5 సంచుల చెత్త, నీటి సీసాలను సేకరించి బెయిలింగ్ కేంద్రానికి తరలిస్తున్నారు.

(c) eenadu

గుంత తవ్వి.. మరమ్మతులు మరిచి

పట్టణంలోని చేపల మార్కెట్‌కు వెళ్లే దారిలో మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం అయిదు రోజుల క్రితం గుంత తవ్వి పనులు పూర్తి చేయలేదు. ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేసి గుంతను పూడ్చాలని, అప్పటి వరకు భద్రతా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పెబ్బేరు పట్టణం**

పట్టు వీడకు.. ప్రమాదానికి చోటివ్వకు

మహబూబ్‌నగర్ నుంచి నారాయణపేట వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. ఉదయం, సాయంత్రం బస్సులు సరిపడా లేకపోవడం, ఉన్నా అందులో నిల్చోవడానికి స్థలం దొరకకపోవడంతో ఫుట్‌బోర్డులపైనే ప్రమాదకరంగా నిలబడి ప్రయాణం సాగిస్తున్నారు. ఏ మాత్రం అదుపుతప్పినా పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పాలమూరు నగరంలో సోమవారం తీసిన చిత్రమిది. **- న్యూస్‌టుడే, నవాబ్‌పేట, కార్పొరేషన్**

సస్యరక్షణతో వేరుసెనగలో అధిక దిగుబడి



కొన్నూరులో సాగైన వేరుసెనగ

మదనాపురం, న్యూస్‌టుడే : జిల్లాలో ఆయా ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంట కింద యాసంగిలో వేరుసెనగ సాగు చేస్తారు. కలుపు, చీడపీడల నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త, కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్ రెడ్డి తెలిపారు. టీఏజీ 24, కదిరి 6, కదిరి 9, లేపాక్షి, హరితాంధ్ర, ధరణి, జేల్ 24, జగిత్యాల పల్లీ 1, టీసీజీఎస్ 1694, గిర్‌నారు-3 గిర్‌నారు-4 అధిక దిగుబడికి అనువైన రకాలని పేర్కొన్నారు. సెప్టెంబరు రెండో వారం నుంచి నవంబరు మొదటి వారం వరకు విత్తనాలు విత్తుకోవచ్చు. 22 సెం.మీ.× 10 సెం.మీ. దూరంలో ఎకరాకు 4.4 లక్షల మొక్కలు ఉండేలా చూసుకోవాలని సూచించారు.

పోషకాల యాజమాన్యం: భాస్వరం, పొటాష్ ఎరువులను విత్తే సమయంలోనే వేసుకోవాలి. ఎకరానికి 100 కిలోల సూపర్ పాస్ఫేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 18 కిలోల యూరియాను విత్తే సమయంలో వేసుకోవాలి. పంట పూత, ఊడలు దిగే సమయంలో 200 కిలోల జిప్సం మొదళ్ల దగ్గర వేయాలి. విత్తిన 30 రోజుల తర్వాత తొలిపూత దశలో ఎకరానికి 10 లేదా 12 కిలోల యూరియా చల్లాలి.

విత్తనశుద్ధి : టెబ్యూకోనోజోల్ 2డీఎస్ మందును ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకొని ఆపై ట్రైకోడర్మా 10 గ్రా., అనంతరం రైజోబియం 5 గ్రా. విత్తనం వేసే 2 గంటల ముందు కలిపి విత్తుకోవాలి.

కలుపు పద్ధతి.. : విత్తిన వెంటనే లేదా 2 రోజుల లోపు కలుపు నివారణకు అలాక్లోర్ ఒక లీటరు లేదా పెండిమిథాలిన్ 1.3 లీటరు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి నేలపై పిచికారీ చేయాలి. గడ్డిజాతి మొక్కలు అధికంగా ఉంటే నివారణకు క్విజలోఫాప్.పి.ఇథైల్ ఎకరాకు 400 మి.లీ. లేదా ప్రోపాక్విజఫాస్.పి.ఇథైల్ ఎకరాకు 250 మి.లీ. విత్తిన 20 రోజుల వరకు పిచికారీ చేసుకోవచ్చు. వెడల్పాకు, గడ్డిజాతి కలుపు 2, 3 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజిథపైర్ 10 శాతం ఎకరాకు 300 మి.లీ లేదా ఇమాజామాక్స్+ఇమాజిథపైర్ 40 గ్రాముల కలుపు మందు ఎకరానికి 200 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి.

చీడపీడలు.. : రసం పీల్చు పురుగు నివారణకు ఫ్రిపోనిల్ 2 మి.లీ. లేదా థయోమిదాక్సామ్ 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోఫిడ్ 0.3 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొగాకు లద్దెపురుగు నివారణకు మొదటిదశలో 5 మి.లీ. వేప మందు (ఎన్ఎస్‌కేఈ)ను క్లోరోపైరిఫాస్ 50 ఈసీ 1.5 మి.లీ. లేదా న్యూవులురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. మందులను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. టిక్కా ఆకుమచ్చ, కాండం కుళ్లు నివారణకు క్లోరోథానిల్ 2 గ్రా. లేదా హెక్సాకోనాజోల్ 2 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్ 1 మి.లీ. లేదా టెబ్యూకోనోజోల్+ ట్రైఫ్లాక్సిస్ట్రొబిన్ ఒక గ్రాము మందును ఏదైనా ఒకటి లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

ఆర్టీసీలో అవిశ్రాంత పోరాటం!

- ప్రయోజనాలు అందక ఏళ్లుగా నిరీక్షణ
- ఆర్థిక ఇబ్బందుల్లో అల్లాడుతున్న వైనం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఉద్యోగ విరమణ పొందిన వారిని కుటుంబ సభ్యులు ఓ విషయంలో ఎప్పుడూ తప్పుబడుతుంటారు. ఏ కాస్త సమయం దొరికినా డిపోల వద్దకు చేరి ఆర్టీసీ బాగోగుల గురించి ఎందుకు చర్చిస్తుంటారని ప్రశ్నిస్తుంటారు. విశ్రాంత జీవితంలోనూ సంస్థ గురించి తపన పడే వారిప్పుడు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు దక్కక కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది ఆర్టీసీ డిపోల పరిధిలో ప్రతి నెలా సగటున 25 నుంచి 30 మంది (డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, ఇతర సిబ్బంది) ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి నెలలు గడుస్తున్నా విశ్రాంత ప్రయోజనాలు అందడం లేదు. ఒక్కో ఉద్యోగికి సగటున రూ.20 లక్షలకు పైబడే అందాల్సి ఉంది. ఈ డబ్బులు చేతికి ఎప్పుడు అందుతాయోనని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు మహబూబ్‌నగర్‌లోని ఆర్ఎం కార్యాలయం చుట్టూ రోజూ చెప్పులరిగేలా తిరుగుతుంటారు.

ఉచిత పథకాల పుణ్యమా అంటూ..: ప్రభుత్వాలు ఉచిత పథకాలు అమలు చేస్తున్న కారణంగా బడ్జెట్ లేక ఆయా ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసే తమకు సకాలంలో ప్రయోజనాలను ఇవ్వలేకపోతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి ఆర్టీసీలోనే కాదూ ప్రతి శాఖలోనూ ఎదురవుతోందంటున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆర్టీసీలో ఉద్యోగ విరమణ చేసిన వారికి మూడు నుంచి ఆరు మాసాల్లోగా రిటైర్డ్ బెనిఫిట్స్ వచ్చేవి. ఆ తర్వాత ఈ గడువు ఏడాదికి పెరిగింది. కాలక్రమేణా ఇది రెండు నుంచి మూడేళ్లకు చేరడంతో ఆర్టీసీ విశాంత్ర ఉద్యోగుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది.

సర్వీసు నిబంధనల ప్రకారం: ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసే వారికి వారం ముందే ప్రయోజనాలు (పీఎఫ్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ, పీఆర్సీ ఎరియర్స్) ఖాతాల్లో జమ చేయాలి.

కుమార్తె పెళ్లికి అప్పు చేశా

2024 నవంబరులో ఆర్టీసీ గద్వాల డిపోలో ఏడీసీ కంట్రోలర్‌గా ఉద్యోగ విరమణ చేశా. 20 మాసాలు గడుస్తున్నా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేదు. రూ.20 లక్షలకు పైగా నాకు రావాలి. చేతిలో డబ్బు లేకపోవడంతో అప్పు చేసి కుమార్తె పెళ్లి చేయడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. ఆర్ఎం కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. **- కె.సుధాకర్‌రెడ్డి, విశ్రాంత కంట్రోలర్, పుట్టపల్లి**

పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలున్నారు.. కనికరించాలి

మహబూబ్‌నగర్ డిపోలో ఐదు నెలల కిందట ఉద్యోగ విరమణ చేశా. 2017, 2021 సంవత్సరాల పీఆర్సీ బకాయిలతో పాటు డీఏ ఎరియర్స్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డబ్బులు రావాల్సి ఉంది. ఇద్దరు అమ్మాయిల పెళ్లిళ్లు చేద్దామని భావిస్తే ఇంత వరకు ఆర్టీసీ నుంచి ప్రయోజనాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా ఉంది. విశ్రాంత ఉద్యోగులపై కక్ష సాధించకుండా వెంటనే ఇవ్వాలి. **- ఎస్.సుగుణమ్మ, విశ్రాంత కండక్టర్**

రూ. 20 లక్షల వరకు రావాలి

మహబూబ్‌నగర్ డిపోలో డ్రైవర్‌గా చేస్తూ ఉద్యోగ విరమణ చేశా. రూ.20 లక్షల వరకు ప్రభుత్వం నుంచి రావాలి. ఇప్పుడు అప్పుడంటూ ఎదురుచూడటం తప్ప ఇవ్వడం లేదు. అప్పు చేసి బిడ్డ పెళ్లి చేశా. అప్పుల వాళ్లు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేకపోతున్నా. **- కె.శ్రీనివాసులు, విశ్రాంత డ్రైవర్**

మా డబ్బు మాకు ఇప్పించండి సార్..

సోషల్ మీడియాలో ప్రకటన చూసి మోసపోయాం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: స్క్రబ్ ఎక్స్ పేరుతో రమేష్ అనే వ్యక్తి, మరికొందరు మోసం చేసి డబ్బు తీసుకుని బోర్డు తిప్పేశారు.. ఈ కేసులో నిందితుడు తిరుమలకొండ రమేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.. అతడి నుంచి తమకు రావాల్సిన డబ్బు ఇప్పించాలని మదనపల్లె, పీలేరు, వాల్మీకిపురం, శ్రీ సత్యసాయిజిల్లా, అనంతపురం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన స్క్రబ్ ఎక్స్ బాధితులు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లెలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌లో ఎస్పీ ధీరజ్‌కు వారు ఫిర్యాదు చేశారు.. తాము సోషల్ మీడియాలో వచ్చిన ప్రకటన చూసి మోసపోయామని వాపోయారు. డబ్బు కట్టామని నిందితుడితో పాటు సంబంధిత పోస్టు పెట్టిన సోషల్ మీడియా నిర్వాహకులపైనా చర్యలు తీసుకోవాలని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాగులో.. సమస్యలా?

బిజినేపల్లి, న్యూస్‌టుడే : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11-12 గంటల మధ్య చరవాణి నంబరు 99514 61694ను సంప్రదిస్తే సందేహాలు నివృత్తి చేస్తామని కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

పశువుల పేడ ఎంత వాడాలి?

మీ కోసం

హన్వాడ, న్యూస్‌టుడే : ఎకరానికి పశువుల పేడ ఎంత వాడాలో చాలా మంది రైతులకు తెలియదు. రూ.వేలు ఖర్చు చేసి ట్రాక్టర్ల కొద్దీ పొలాల్లో వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. ఎలాంటి రసాయన మందులు చల్లని రైతులు ఎకరానికి 100 కిలోల జల్లెడ పట్టిన పశువుల ఎరువు వాడితే సరిపోతుంది. దీన్ని కల్చర్ మాదిరిగా ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. పశువుల ఎరువును పెంటకుప్ప నుంచి తీసి ఏడు రోజుల పాటు ఆరబెట్టి జల్లెడ పట్టాలి. వానాకాలం, యాసంగిలో విత్తనాలు విత్తేటప్పుడు వేసుకుంటే సరిపోతుంది. దీంతో పాటు పొడిగా ఉండే ఘనజీవామృతాన్ని కలిపి విత్తుకోవచ్చు.

పురుగుల నివారణలో జిగురు అట్టల పాత్ర కీలకం

బిజినేపల్లి, న్యూస్‌టుడే : లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలు ఉపయోగించి ఎరువుల వినియోగం తగ్గిస్తూ, పంటకు హాని చేసే కీటకాలు, కాయతొలిచే పురుగును అరికట్టవచ్చని కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల తెలిపారు.

ఇలా చేయాలి.. : అన్ని రకాల పంటలకు ఆశించే పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక పురుగులను పసుపురంగు అట్టలు ఆకర్షిస్తాయి. ముఖ్యంగా కూరగాయల పంటల సాగులో వీటిని వినియోగించవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి. వివిధ రకాల పంటలకు ఆశించే ఎర్ర నల్లి, తెల్ల నల్లి, తామర పురుగు నివారణకు నీలి రంగు అట్టలు వాడవచ్చు. ఎకరానికి 20 -25 అమర్చుకోవాలి. తెలుపు రంగు జిగురు అట్టలను రసం పీల్చే పురుగులు, తామర పురుగు నివారణకు వాడవచ్చు. ఎకరానికి 20-25 అమర్చుకోవాలి

లింగాకర్షక బుట్టలు : కాయ తొలుచు పురుగుల నివారణకు వీటిని వాడతారు. వీటి వల్ల మగ పురుగులు ఆకర్షితమై, సంతతి గణనీయంగా తగ్గుతుంది. వీటిని ప్రతి 21 రోజులకు ఒకసారి మార్చడం వల్ల మగ పురుగులను ఆశించే సామర్థ్యం పెరుగుతుంది. ● పురుగుల ఉద్ధృతిని గమనించడానికి ఎకరానికి 4-5 బుట్టలు అమర్చుకోవాలి. 10-20 బుట్టలు అమర్చుకోవడం ద్వారా కొంత మేర పురుగును నివారించవచ్చు. 50-60 శాతం నివారణకు లేదా పరాగసంపర్కాన్ని నిరోధించడానికి ఎకరానికి 100-120 బుట్టలు అమర్చుకోవాలి. పంటల ఎత్తు పెరిగే కొద్దీ వీటి ఎత్తు పెంచుకోవాలి.

రైతేరాజు

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో కాండం తొలిచే పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? **- శివకుమార్, పెబ్బేరు**

✔ నారు నాటిన 15 రోజుల తర్వాత ఎకరానికి 4 కిలోల క్లోరాంట్రనిలిప్రోల్ గుళికలు వేయాలి.

? కందిలో ఆకులపై పురుగులు గూడు పెడుతున్నాయి. వాటి ఎలా నివారించాలి? **- నిరంజన్ యాదవ్, చేగుంట**

✔ కందిలో ఆకుగూడు నివారణకు 2 మి.లీ. క్లోరిపైరిఫాస్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఆకు గూడును అరికట్టవచ్చు.

? జొన్నలో మొవ్వ తొలుచు పురుగు ఆశించింది. నివారణ ఎలాంటి చర్యలు చేపట్టాలి? **- రామాంజనేయులు, మమ్మాయిపల్లి**

✔ జొన్న శాఖీయ దశలో మొవ్వతొలుచు పురుగును గమనిస్తే 1.0 మి.లీ. సైపర్‌మెత్రిన్ ద్రావణానికి లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.

(కేవీకే కీటక శాస్త్రవేత్త డా.శైల సమాధానాలిచ్చారు)

- న్యూస్‌టుడే, బిజినేపల్లి

అర చేతిలో పల్లె ప్రగతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఏ సమాచారమైనా ఒక్క క్లిక్‌తో తెలుసుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా 'జీపీ ప్రొఫైల్' (జీపీఎస్ఏపీ) అనే వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చాయి. రాష్ట్రంలోని అన్ని పంచాయతీల సమగ్ర సమాచారాన్ని అభివృద్ధి పనులు, ప్రణాళికలను పారదర్శకంగా నిర్వహించడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. పంచాయతీకి సంబంధించిన ప్రతి అంశాన్ని డిజిటలైజ్ చేశారు. ఈ పోర్టల్‌లో పల్లెలకు సంబంధించిన పూర్తి వివరాలు చూడటానికి చరవాణి లేదా అంతర్జాలంలోని గూగుల్ క్రోమ్‌ను తెరిచి https://gpsap&prrd.telangana.gov.in/gpprofile లింక్‌ను ఓపెన్ చేయాలి.

జిల్లాల వారీగా పంచాయతీల వివరాలు

వనపర్తి	268
మహబూబ్‌నగర్	423
నాగర్‌కర్నూలు	460
నారాయణపేట	272
జోగులాంబ గద్వాల	255

వెబ్ పేజీలో సమగ్ర సమాచారం: పేజీని తెరిచిన వెంటనే జిల్లా, మండలం, పంచాయతీ కోడ్ నమోదు చేస్తే అందులో ప్రజాప్రతినిధులు, కార్యదర్శి వివరాలతో పాటు పంచాయతీలో ఉన్న జనాభా (స్త్రీ, పురుషులు), గృహాల సంఖ్య పొందుపరిచారు. వీటితో పాటు సీసీ రహదారులు, మురుగు కాల్వలు, వీధి దీపాలు, తాగునీటి కనెక్షన్లు, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్, ట్రాక్టర్ లభ్యత, పంచాయతీ అధీనంలో ఉన్న భవనాలు, స్థలాలు, కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నిధుల వినియోగం, తదితర అంశాలను వెబ్ పేజీలో అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం

పీయూ వీసీ శ్రీనివాస్

క్రికెట్ ఆడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు, న్యూస్‌టుడే: అధ్యాపకులు, సిబ్బంది నిత్యం ఏదో ఒక క్రీడ ఆడుతూనే ఉండాలని, అప్పుడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక పీయూలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పలు క్రీడాపోటీలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల మధ్య స్నేహభావం, సమన్వయం పెంపొందడానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని సూచించారు. ఈ క్రీడా పోటీలు సోమవారం నుంచి గురువారం వరకు జరుగుతాయన్నారు. వీసీ, ఓఎస్డీ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో వీసీ జట్టు 60 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, పీడీ శ్రీనివాసులు, పలు విభాగాల అధ్యాపకులు నాగం కుమారస్వామి, రాజ్‌కుమార్, ఈశ్వర్‌కుమార్, రవికుమార్, అర్జున్‌కుమార్, రాజశేఖర్, శ్రీనివాస్, గాలెన్న, సుస్మిత, చిన్నాదేవి, ప్రభాకర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, రంగప్ప పాల్గొన్నారు.

316 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు(అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో సోమవారం 8 టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన 4, దిగువన 4 యూనిట్లలో 316 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 21,324 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయ సమాచారం

అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30కు తెరుస్తారు. స్వామి వారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, ఉదయం 9 నుంచి 11 గంటలకు రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి. జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7కు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగులయ్య

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం తొలిసారి పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే. సోమవారం డీఎస్పీ మొగులయ్య పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఇటిక్యాల మండలానికి చెందిన బోయ బీసన్న(50), మల్దకల్ మండలానికి చెందిన తనగల గోకారి (29) గంజాయిని సరఫరా చేస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో వారిని పట్టుకొని 5.057 కేజీల 10 ప్యాకెట్ల గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఇద్దరు తమ భూముల్లో పంటల సాగుతో పాటు గంజాయి మొక్కలు పెంచి వాటిని ఎండబెట్టి గద్వాల, ఎర్రవల్లి, కొత్తకోట ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై గద్వాలకు వస్తున్నారన్న సమాచారంతో పట్టుకున్నట్లు వివరించారు. ఇద్దరిపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో పట్టణ ఎస్సై కల్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సైని సస్పెండ్ చేయాలని భాజపా ధర్నా

ఎస్పీ కార్యాలయానికి ఎస్సై అటాచ్

కోడేరు, న్యూస్‌టుడే: యువకుణ్ని ఠాణాకు పిలిపించి ఎస్సైతో పాటు నలుగురు కానిస్టేబుళ్లు కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో చోటుచేసుకున్న పరిణామాలు కోడేరు ఎస్సైని ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసేవరకు వెళ్లాయి. బాధితుడితో పాటు భాజపా నేతలు, గ్రామస్థులు సోమవారం ధర్నా నిర్వహించడంతో మండల కేంద్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్థుల కథనం ప్రకారం. . మండలంలోని ఠాకూర్‌తండాకు చెందిన డా.పరమేశ్వర్, నార్యానాయక్‌తండాకు చెందిన పాండునాయక్ వ్యక్తిగతంగా సోషల్ మీడియాలో విమర్శలు చేసుకున్నారు. దీంతో పాండునాయక్ కోడేరు ఠాణాలో పరమేశ్వర్‌పై ఫిర్యాదు చేశారు. పరమేశ్వర్‌ను ఆగస్టు 28న విచారణకు ఠాణాకు పిలిపించి ఎస్సై వేణుగోపాల్, కానిస్టేబుళ్లు కొట్టారు. గాయపడిన బాధితుడు తండా ప్రజలు, భాజపా నాయకుడు ఎల్లేని సుధాకర్‌రావుకు మొరపెట్టుకున్నారు. అంతకు ముందే డీజీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం భాజపా నాయకులతో ఠాణాకు పాదయాత్రగా వెళ్లారు. కొల్లాపూర్ సీఐ శంకర్, ఎస్సై, సిబ్బందితో వారిని అడ్డుకోగా రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయంలో 'న్యూస్‌టుడే' డీఎస్పీ శ్రీనివాస్ యాదవ్‌ను వివరణ కోరగా ఎస్సై వేణుగోపాల్‌పై గతంలోనే పలు ఆరోపణలు వచ్చాయన్నారు. తాజా ఆరోపణలతో ఎస్పీ కార్యాలయానికి ఆటాచ్ చేసినట్లు వివరించారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ సీఐ శంకర్.. కోడేరు ఠాణా బాధ్యతలు చూస్తారని, త్వరలోనే మరో ఎస్సైని నియమిస్తామన్నారు.

కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం

దస్త్రాలు పరిశీలిస్తున్న మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం, ఎస్పీ జానకి

భూత్పూర్, న్యూస్‌టుడే: పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం సూచించారు. భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ జానకితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఠాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందిని అప్రమత్తం చేయాలని అన్నారు. వివిధ ఠాణాల దస్త్రాలు పరిశీలించి నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల నియంత్రణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణకు సమష్టి కృషి

సూచనలు చేస్తున్న రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ జయలక్ష్మి

పాలమూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడానికి సమష్టి కృషి అవసరమని, లక్ష్య సాధనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జేడీ డా.జయలక్ష్మి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు పలు ప్రాంతాలను ఆమె పరిశీలించారు. తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమణ నివారణ (పీపీటీసీటీ) సేవలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ బాధితులు మహబూబ్‌నగర్ జీజీహెచ్‌లోని ఏఆర్‌టీ సెంటర్‌కు వస్తున్నారని, వారికి నాణ్యమైన వైద్యసేవలతో పాటు సలహాలు, సూచనలు అందించాలన్నారు. జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, కుష్ఠు విభాగ అధికారి రాజు, డా.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

EENADU e Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

మహబూబ్‌నగర్ భగీరథకాలనీ నర్సరీ బజార్ మినీ అపార్ట్‌మెంట్ నందు 66 గజాల ఈస్ట్ ఫేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర: 9704209449

JOBS

Required Female Typist for Jaya Diagnostic Centre, Club Road, Jadcherla, Behind M.R.O office, fast typing skills required English Language, Salary as per experience.... Jaya Diagnostic Centre, Club Road, Jadcherla. Contact Number : 99665 02502

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001824

(c) eenadu

రూ.కోట్లు వెచ్చించి.. వృథాగా వదిలేసి

రాజోలిలోని అలంపూర్ మంచినీటి పథకం గదిలో ఉన్న మోటార్లు నిరుపయోగంగా మారాయి. 12 ఏళ్ల కిందట రూ.12 కోట్లు పైగా వెచ్చించి మంచినీటి పథకం నిర్మించగా, ఆ పనుల్లో భాగంగా ఇన్‌టెక్‌వెల్ నిర్మాణం, ట్యాంకులు, పంప్‌హౌస్, రెండు మోటార్లు ఏర్పాటు చేశారు. కానీ ప్రారంభించకుండానే వదిలేయడంతో ప్రస్తుతం సామగ్రి తుప్పు పట్టింది. - **న్యూస్‌టుడే, రాజోలి**

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
గద్వాల అర్బన్ : 7032727072 అలంపూర్ : 8008573916
అయిజ : 8008573922 అలంపూర్ పట్టణం : 7993300519

తెరపై ఈనాడు

గద్వాల: ఎస్వీసీ..: **ఇరుముడి, టాక్సిక్, విశ్వనాథ్ అండ్ సన్స్, హాయ్**, **అయిజ:** శివసాయి : **హుషార్ పిట్టలు**, మాధవ్ : **ఇరుముడి**, భువనేశ్వర్ : **టాక్సిక్**

– న్యూస్‌టుడే, గద్వాల అర్బన్, అయిజ

వైద్య శాఖ స్థలంపై పరుల కన్ను

ప్రహరీ నిర్మిస్తేనే.. రక్షణ

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే: వైద్య, ఆరోగ్య శాఖకు గోపాల్‌పేటలో ప్రభుత్వం కేటాయించిన స్థలంపై పరుల కన్ను పడింది. ఇప్పటికే కొంత మేరకు ఆక్రమణకు గురైందని.. వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రహరీ నిర్మిస్తేనే స్థలం కబ్జాకు గురి కాకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

శిథిలావస్థకు చేరిన వైద్య సిబ్బంది నివాసగృహాలు

నిఘా

సిబ్బంది నివాస గృహాల కోసం..: మండలాల వ్యవస్థ ఏర్పడిన తర్వాత ప్రతి మండల కేంద్రంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గోపాల్‌పేటలోని పీహెచ్‌సీలో పని చేసే వైద్యులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండేందుకు రామ్‌నగర్ కాలనీ (దేవాలయం సమీపం)లో సుమారు అర ఎకరాకు పైగా భూమి కేటాయించి, అందులో నివాస గృహాలు నిర్మించింది. ఇవి ఆసుపత్రికి దూరంగా ఉండటంతో వైద్య సిబ్బంది అక్కడ ఎవరూ నివసించ లేదు. అందులో అమర్చిన ఫ్యాన్లు, లైట్లు, కిటికీ తలుపులు, కరెంటు సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు.

ప్రహరీ నిర్మాణానికి కృషి

గోపాల్‌పేటలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది నివాస గృహాలు శిథిలావస్థకు చేరాయని, చుట్టూ ఖాళీస్థలం ఉన్న విషయం తెలిసింది. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడతాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తా.

- డాక్టర్ భాస్కర్ నాయక్, డీఎంహెచ్‌వో

వసతి గృహం నిర్వహణ..: గోపాల్‌పేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ బాలుర వసతి గృహాన్ని, వృథాగా ఉన్న వైద్యసిబ్బంది నివాస గృహాల్లో నిర్వహిస్తే ప్రభుత్వానికి అద్దె మిగులుతుందని 'ఈనాడు'లో కథనం రావడంతో అధికారులు వసతి గృహాన్ని అక్కడికి తరలించారు. మూడేళ్ల కిందటి వరకు అందులోనే కొనసాగింది. భవనాలు శిథిలావస్థకు చేరడంతో మరో అద్దె భవనంలోకి వసతి గృహాన్ని మార్చారు.

మరో శాఖకు బదిలీ చేయాలని..: భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం. అక్కడ ఎవరూ ఉండక పోవడం వల్ల ఆప్రాంతంపై ఇతరుల కన్ను పడింది. అటు వైపు ఎవరూ సంచరించక పోవడం, ప్రహరీ నిర్మించక పోవడం కారణంగా ఆస్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. స్థలాన్ని వైద్యారోగ్యశాఖ నుంచి మరో శాఖకు బదిలీ చేయించి నివాస గృహాలుగా మార్చాలనే ప్రయత్నాలు కూడా చేసినట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలాలు ఎక్కడ కనిపించినా వాటిని ఆక్రమించుకునేందుకు చాలా మంది కొత్త దారులు వెతుకుతున్నారు.

సాగునీరు అందించాలని కేంద్ర మంత్రికి వినతి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణతో మానవపాడు గ్రామస్థులు, నాయకులు

ఉండవల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మారమునగాల వద్ద కృష్ణానది నుంచి ఎత్తిపోతల ఏర్పాటు చేసి ఆర్డీఎస్ 32 ఏ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా సాగు నీరు అందిస్తే 25వేల ఎకరాలకు మేలు జరుగుతుందని, ఎత్తిపోతల ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏటా సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయని, ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్‌లో చెన్నై ఎగ్మోర్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపితే అలంపూర్ ఆలయాలకు రాకపోకలు సాగించే భక్తులకు, నియోజకవర్గ ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని సర్పంచి చిన్న నాగరాజు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీ డీకే.అరుణ, ఎమ్మెల్యే విజయుడు, భాజపా మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు మహేంద్ర, వెంకటేష్, శేషన్‌గౌడ్, సుంకన్న, సురేష్, శేషన్న, రాజు పాల్గొన్నారు.

అలంపూర్, శాంతిగనర్, మానవపాడు, న్యూస్‌టుడే: ఆర్డీఎస్ ఇండెంట్ 4 టీఎంసీల నీటిని విడుదల చేసేలా తుంగభద్ర బోర్డు అధికారులను కోరాలని రైతులు కేంద్ర మంత్రికి విన్నవించారు. ఈ మేరకు అలంపూర్ హరిత టూరిజం వద్ద సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో మల్లమ్మకుంట రిజర్వాయర్, 42/6 కిలో మీటర్ నుంచి 105 కిలో మీటర్ల వరకు పూర్తిస్థాయిలో లైనింగ్ చేయాలని కోరారు. తుంగభద్రలో పూడిక ఏర్పడటంతో 165 టీఎంసీల సామర్థ్యం ఉన్న డ్యామ్.. ప్రస్తుతం 103 టీఎంసీలకు పడి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్ మాజీ ఛైర్మన్ సీతారాంరెడ్డి, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు. ● మానవపాడు వద్ద రైల్వే రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణకు సోమవారం వినతిపత్రం అందజేశారు.

ముగిసిన క్రీడా పోటీలు

అయిజ, న్యూస్‌టుడే: మేడికొండ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎస్జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు సర్పంచులు లైజమ్మ, రాధ, హెచ్ఎం తిమ్మారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు జగదీశ్, సతీశ్, సుబ్బయ్య, సురేశ్, రాజేశ్ బహుమతులు అందజేశారు.

వర్షం కురవాలని పూజలు

మానవపాడు, న్యూస్‌టుడే: మానవపాడు రైతు సంఘం సభ్యులు, గ్రామస్థులు వర్షం కురవాలని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరమేశ్వరుడు, వీరభద్ర స్వామి ఉత్సవ విగ్రహాలను ఎద్దుల బండ్లపై ఉంచి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు దేవుళ్లకు పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని రైతులు ఆకాంక్షించారు.

స్మార్ట్ రేషన్ కార్డుల అందజేత

కార్డులు చూపుతున్న సర్పంచి తిమ్మోతి, రాములు

అయిజ, న్యూస్‌టుడే: స్మార్ట్ రేషన్ కార్డులను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాములు పేర్కొన్నారు. ఉప్పల గ్రామంలో సోమవారం వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. సర్పంచి తిమ్మోతి, పంచాయతీ కార్యదర్శి రామన్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

చిన్నారులతో సర్పంచి శిరీష తదితరులు

మల్దకల్, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని సర్పంచి అల్వాల శిరీష పేర్కొన్నారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత ఏకరూప దుస్తులను సోమవారం సర్పంచి, రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉప సర్పంచి లక్ష్మీనర్సింహ, జయలక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న డీసీసీ కార్యదర్శి, ఎంపీడీవో, సర్పంచులు

మానవపాడు, న్యూస్‌టుడే: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్ పేర్కొన్నారు. సోమవారం మానవపాడులో లబ్ధిదారు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎంపీడీవో రాఘవ, మండలాధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజేష్, సర్పంచి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే డా.అబ్రహం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఔషధాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సంధ్యా కిరణ్మయి

ఇటిక్యాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో సంధ్యా కిరణ్మయి ఆదేశించారు. సోమవారం ఇటిక్యాల పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దస్త్రాలు, ఔషధాల నిల్వలు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

జాతుల విముక్తి దినోత్సవంలో పాల్గొన్న సంచార జాతులు

విద్యా సంస్థల్లో పది శాతం కోటా ఇవ్వాలి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సంచార జాతుల పిల్లలకు ఆశ్రమ పాఠశాలలు, విద్యా సంస్థల్లో ప్రత్యేకంగా పది శాతం కోటా ఇవ్వడంతో పాటు, ప్రత్యేక స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని సంచార జాతుల సంఘం జిల్లా ఇన్‌ఛార్జి బొప్పల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఐడీవోసీలో విముక్తి జాతుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్‌బాష షేక్‌కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం గుర్తించిన 51 డీఎన్‌టీ కులాలకు వెంటనే ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని కోరారు. యువతకు నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధికి రుణాలు, మహిళలకు ఉపాధి శిక్షణ, కమ్యూనిటీ భవనాలు, శ్మశాన వాటికలు, ఎంబీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్ల పంపిణీ

అయిజ, న్యూస్‌టుడే: మండలంలోని వెంకటాపూర్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సర్పంచి శకుంతలమ్మ సొంత ఖర్చులతో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. సుమారు 50 మంది విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి తన వంతు సహకారం అందించానని సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి భీమన్న నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

కార్యకర్తలకు సూచనలు చేస్తున్న సీడీపీవో హేమలత

రాజోలి, న్యూస్‌టుడే: గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహించొద్దని సీడీపీవో హేమలత పేర్కొన్నారు. సోమవారం రాజోలి గ్రామంలో మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొందరు అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, లబ్ధిదారులకు సరకుల పంపిణీ సక్రమంగా చేపట్టడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్ వైజర్లు, శ్రీవాణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని డిమాండ్

గట్టు, న్యూస్‌టుడే: భారత్‌మాల రహదారి నిర్మాణంలో భాగంగా సల్కాపురం, జోకన్ గట్టు గ్రామాల శివారులో మెగా కంపెనీ ఏర్పాటు చేసిన మైనింగ్ క్రషర్ బ్లాస్టింగ్‌తో నష్టపోయిన రైతు యేసన్నను ఆదుకోవాలని సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతును కేవీపీఎస్ నాయకుడు మారెన్న, సీపీఐ నాయకుడు వీవీ నర్సింహ, ఐద్వా నాయకురాలు నర్మదా సోమవారం పరామర్శించి మాట్లాడారు. రైతు పొలం గుండా రాకపోకలకు ఒప్పందం చేసుకున్న కంపెనీ.. సరైన పరిహారం ఇవ్వకపోగా బ్లాస్టింగ్‌లతో బోరుబావి, పొలం గట్టు కూలిపోయి ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆరోపించారు. కంపెనీ నిర్లక్ష్యం, అప్పుల బాధతో మనస్తాపం చెందిన రైతు ఇటీవల పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, రైతుకు న్యాయం చేయాలని కోరారు.

శక్తి స్కీం, జీవో 97 రద్దు చేయాల్సిందే

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఈనాడు, దిల్లీ: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న శక్తి స్కీం, జీవోనం.97ను రద్దు చేసి పాత పద్ధతిలో పాలిటెక్నిక్‌ను కొనసాగించాలని భారాస నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన దిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'రాష్ట్రంలో 80 వేల మంది విద్యార్థులు 10 వేల మంది ఉపాధ్యాయులు శక్తి స్కీమ్, జీవోనం.97ను రద్దు చేయాలని ఆందోళన చేస్తున్నారు. విద్యార్థులను ఇంజినీర్లుగా చేయాల్సిన ప్రభుత్వం కూలీలను చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రూ.కోట్ల విలువైన పాలిటెక్నిక్ కళాశాలల భూముల్ని ప్రైవేటు వారికి ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోంది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమం చేస్తాం' అని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో భారాస నేతలు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ● జనగణనలో ఓబీసీ కులగణన శాస్త్రీయంగా, పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి కులానికి యూనిక్ కోడ్ కేటాయించాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

'కాంగ్రెస్ గూండాల దాడి పిరికిపంద చర్య'

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర కార్యాలయంపై సోమవారం కాంగ్రెస్ గూండాల దాడి ఓ పిరికిపంద చర్య అని ఎంపీ డీకే అరుణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ ప్రతిని చేతబట్టి నీతి సూక్తులు వల్లించే డూప్లికేట్ గాంధీ ఈ దాడిపై స్పందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ దివాలా కోరుతనానికి, నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న భాజపా కార్యాలయానికి రక్షణ కల్పించడంలో ఇంటెలిజెన్స్, స్థానిక పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని, అధికార పార్టీ కనుసన్నల్లోనే ఈ దాడి జరిగిందనేది స్పష్టమవుతోందని డీకే అరుణ తీవ్రంగా ఖండించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధరూరు న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని కేజీబీవీలో నైట్ వాచ్‌మెన్ పోస్టు ఖాళీగా ఉందని, అందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి గోమతి తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులని ఆమె చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కనీస వేతనాల సాధనకు ఉద్యమం

మాట్లాడుతున్న సూర్యం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: సీఎం రేవంత్‌రెడ్డి తక్కువ వేతనాలతో కూడిన జీవోని విడుదల చేశారని, అది కూడా నేటికీ అమలుకు నోచుకోలేదని టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం అన్నారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ సర్కార్ కంటే తమది భిన్నమైన ప్రభుత్వమని చెబుతున్న సీఎం తక్కువ వేతనాలతో కూడిన జీవోను విడుదల చేయడం సరికాదన్నారు. జీవో నం.6ను అమలు చేయని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు హనుమంతు, కృష్ణ, ప్రేమరాజ్, శివన్న, మద్దిలేటి ఉన్నారు.

24 గంటల విద్యుత్తు సరఫరా అందించాలి

తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

గట్టు, న్యూస్‌టుడే: వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు సరఫరా అందించాలని రైతులు ఆందోళన బాట పట్టారు. కొంత కాలంగా రోజుకు 12 గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారని, అందులోనూ తరచూ కోతలు విధించడంతో పంటలు తడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ ప్రభావంతో భూగర్భ జలాలపైనే ఆధారపడాల్సి వస్తున్న తరుణంలో విద్యుత్తు కోతలతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబరు 1న స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా తలపెట్టినట్లు ప్రకటించారు. నిరసనకు అనుమతి ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి, విద్యుత్తు శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాయపురం రాముడు, రాము, తిమ్మప్ప, వెంకటేశ్, ఆంజనేయులు, భీంరెడ్డి పాల్గొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

కరపత్రాలు ప్రదర్శిస్తున్న కార్మికులు

గట్టు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగే తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ యూనియన్‌ల 8వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి నర్సింహులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మాచర్లలో కార్మికులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. అసంఘటిత, వ్యవసాయ అనుబంధ రంగాల కూలీలు అందరూ తరలివచ్చి సభలను విజయవంతం చేయాలని కోరారు. 8వ పే కమీషన్ ప్రకారం రోజుకు రూ.920 సమాన వేతనం ఇవ్వాలని పేదలకు మిగులు భూముల పట్టాలు అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత జాబ్‌కార్డు, 200 రోజుల పనిదినాలు, వారానికోసారి వేతనం చెల్లించడంతో పాటు కూలీలకు ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించి మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో పాపమ్మ, మహేశ్వరి, లావణ్య, వెంకటమ్మ, లక్ష్మీ, వీరన్న పాల్గొన్నారు.

పుర స్థలాల కబ్జాపై ఉదాసీనత ఎందుకు?

అధికారుల తీరుపై కౌన్సిలర్ల మండిపాటు

డీసెంట్ నోట్ అందిస్తున్న భారాస కౌన్సిలర్లు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: అధికారుల ఉదాసీనతతోనే పుర స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని అధికార, ప్రతిపక్ష పార్టీల కౌన్సిలర్లు విమర్శించారు. స్థానిక కార్యాలయంలో సోమవారం పుర ఛైర్‌పర్సన్ జయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు కాంళ్లే, సంటెన్న, వెంకటేష్ మాట్లాడుతూ.. పురపాలక సంఘానికి చెందిన రూ.కోట్లు విలువ చేసే పది శాతం స్థలాలను కొందరు రాజకీయ నాయకులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జమ్మిచేడు, పట్టణంలోని భీం నగర్, జూరాల కాలువ వద్ద పురపాలికకు సంబంధించిన స్థలాలను కబ్జా చేస్తున్నారని చెప్పారు. అనంతరం 13 అంశాలతో కూడిన అజెండాను సమావేశంలో ప్రవేశపెట్టారు. అజెండాలోని 12వ అంశంపై భారాస కౌన్సిలర్లు డీసెంట్ నోట్‌ను ఛైర్‌పర్సన్‌కు అందించారు. అనంతరం అజెండా అంశాలను ఆమోదించారు.

పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యం

అధికారులకు సూచనలు చేస్తున్న ఎండీ గౌతమి

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని హరిత హోటల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. వసతి గదులు, రెస్టరెంట్, పరిసరాలను పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. హోటల్ ప్రాంగణంలో కాంపౌండ్ వాల్, లిఫ్టు ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

సుశీలమ్మ

ఉండవల్లి, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ సోమవారం మహిళ మృతి చెందారు. ఈ ఘటనపై ఉండవల్లి ఠాణాలో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బండారి సురేష్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌కు చెందిన సుశీలమ్మ (51) కుమారుడు సునీల్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఏపీలోని పంచలింగాలలో తమ్ముడికి రాఖీ కట్టేందుకు బయలుదేరారు. ఉండవల్లి మండలంలోని బొంకూరు గ్రామ శివారులో అతివేగం కారణంగా వాహనంపై నుంచి కిందపడ్డారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్స్‌లో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త లక్ష్మన్న ఫిర్యాదుతో కేసు విచారిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పాన్ దుకాణంలో చోరీ

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఓ పాన్ దుకాణంలో చోరీ జరిగింది. స్థానికుల కథనం మేరకు.. విష్ణుప్రియ హోటల్ సమీపంలో యుగంధర్ పాన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆయన ఆదివారం రాత్రి దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం ఆయనకు దుకాణంలో చోరీ జరిగిందని సమాచారం అందడంతో వెళ్లి చూశారు. రూ.80వేలు, సిగరెట్లు, నాలుగు చరవాణులు దొంగిలించినట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

మల్దకల్, న్యూస్‌టుడే: మండలంలో ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. తాటికుంటకు చెందిన జయలక్ష్మి (30) శనివారం రాత్రి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె భర్త లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ధర్నా

వినతిపత్రం అందిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి

కృష్ణవేణిచౌక్(గద్వాల), న్యూస్‌టుడే: మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెల్ల రేషన్‌కార్డు దారులకు 14 రకాల నిత్యావసర సరకులు పంపిణీ చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో పూర్తయిన నర్సింగ్ కళాశాల, వసతిగృహం, బాల సదనాలను వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా సభ్యుడు ఉప్పేరు నరసింహ, బాలకృష్ణ, విష్ణు, వీరేష్, నరసింహ, రామకృష్ణ, ఎల్లప్ప, చంద్రుడు, మహేష్ పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన

శాంతినగర్, న్యూస్‌టుడే: పైపాడులో సోమవారం చీడ పీడల సమగ్ర సస్య రక్షణ యాజమాన్య పద్ధతులపై మండల వ్యవసాయాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురుగు మందులు ఇష్టానుసారంగా వాడటంతో కలిగే నష్టాలను వివరించారు. దోమల నివారణకు బుట్టలు, పురుగుల నివారణకు వేప నూనె వాడాలన్నారు. పంటల ఎదుగుదలకు నానో యూరియా, నానో డీఏపీ ద్రావణాలను వినియోగించాలన్నారు. ఏవో రాధ, రేకాంత్‌రెడ్డి, వినోద్, చంద్రకళ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
జిల్లా ప్రజలకు, మా కస్టమర్లకు, LIC ఏజెంట్లకు, అధికారులకు
LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు.
జీవిత బీమా కుటుంబ సభ్యులందరికీ రక్షణ కవచం.. బీమా చేయండి.. ధీమాగా జీవించండి.
పారిజాత కిరాణం & జనరల్ స్టోర్స్
మెయిన్ బజార్, పాతబస్టాండ్, గద్వాల

అల్వాలపాడు గంగా వెంకటేశ్వర్లు
LIC Cheif Life Insurence Adviser
Cell: 9440297986

LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు
జిల్లా ప్రజలకు, మా కస్టమర్లకు, LIC అధికారులకు, ఆఫీస్ సిబ్బందికి, LIC ఏజెంట్లకు LIC 70వ వ్యవస్థాపక దినోత్సవ శుభాకాంక్షలు.
జీవిత బీమా కుటుంబ సభ్యులందరికీ రక్షణ కవచం.. బీమా చేయండి.. ధీమాగా జీవించండి.

రేమట మురళికృష్ణ
LIC ఏజెంట్, ZM క్లబ్‌మెంబర్, గద్వాల
మల్లెందొడ్డి గ్రా॥, మల్దకల్ మం॥. Cell: 9440706760

LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు LIC
మా పాలసీదారులకు, అధికారులకు, మిత్రులకు ప్రజలకు, శ్రేయోభిలాషులకు అందరికి
LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
పాలసీ చేయండి.. ధీమాగా ఉండండి
కె.రాముడు LIC ఏజెంట్,
సుంకులమ్మమెట్టు, జోగులాంబ గద్వాల జిల్లా.
Cell: 94405 47001

(c) eenadu